# భక్తియను పంజరపు చిలుక

సత్యమూర్తి భక్తితత్వము గల మనిషి! పరోపకారి! దేవుణ్ణి నమ్ముకుని బతికేవాడు! ఇతరులకు హాని చెయ్యకూడదన్నది, ఆయన దృఢ నమ్మకం! అంతేకాదు! పురాణాలు, ఇతి హాసాలు శ్రద్ధగా చదువుకుని, మననం చేసుకునే వాళ్ళెవరూ కూడా, జీవితంలో తప్పు త్రోవ పట్టరని గట్టి నమ్మకం గలవాడు! అందుచేతనే, తన ఒక్కగానొక్క కొడుక్కి చిన్నప్పట్నుంచీ హితబోధలు చేసేవాడు, ముఖ్యంగా రామాయణంలోని విషయాలు పదే పదే చెప్పేవాడు. ఆయన కొడుకు కృష్ణమూర్తికి తండ్రి మాటంటే అత్యంత గౌరవం. ఎప్పుడు చదువుమీదే ధ్యాస. తండ్రి చెప్పిన మంచి మాటలు మనస్సులో పెట్టుకుని మననం చేసుకునేవాడు.

కృష్ణమూర్తి కష్టపడి చదువుకుని, ఒక ప్రభుత్వశాఖలో బాధ్యతగల మంచి ఉద్యోగం సంపాదించాడు. తలచుకుంటే చాలా సంపాదించేవాడే కాని, ఎప్పుడూ తప్పుడు పనులు చేయకూడదని, అన్యాయార్జితం జోలికి పోయేవాడు కాదు! తన తోటి ఉద్యోగస్థులకు ఇతని వైఖరి వలన ఇబ్బందిగా ఉండేది. పైవాళ్ళు యధేచ్ఛగా సంపాదిస్తుంటే, క్రింది సిబ్బంది కూడా యథాశక్తి ఐశ్వర్యవంతులు కావచ్చు! ఏదైనా తగాదా జరిగితే, "ఏం నీవు మాత్రం" అనవచ్చు. కృష్ణమూర్తి విషయంలో, అటువంటి అవకాశం లేకుండాపోయింది. కృష్ణమూర్తి క్యాంప్ వెళ్ళినపుడు అక్కడ గెస్ట్‌హౌస్‌లో చాలా ఖరీదైన ఏర్పాట్లతో ప్రలోభపెడదామని, తోటి ఉద్యోగులు ప్రయత్నం చేసేవారు. కాని కృష్ణమూర్తి లొంగలేదు! ఆ ఊళ్ళోనే ఉండే పెద్ద భూస్వామి కూడా కృష్ణమూర్తిని సుఖాలలో పాలుపంచుకోమని, పదేపదే చెప్పాడు. కృష్ణమూర్తి కొంచెం ప్రలోభానికి దగ్గరవుతున్న సమయములో, శ్రీరాముని ఉత్తమ గుణములు జ్ఞాపకం వచ్చాయ్. కృష్ణమూర్తి వేరే ఊరికి బదిలీ చేశారు.! అక్కడ కూడా ఇదే తంతు! దేనికీ లొంగేవాడు కాదు. పై అధికారులు ఆయనపై ఛలోక్తులు విసురుతూ, "ఏమయ్యా కృష్ణమూర్తీ! ఉద్యోగంలో కొన్ని పట్టువిడుపులుండాలి. ఏమైనా, అన్నింటికీ మడికట్టుకు కూర్చుంటే, అనేక విషయాల్లో అందరికీ ఇబ్బంది కలిగించినవాడవుతావు. అయినా, రోజులా చాలా మారిపోయాయి! కేవలం ఒక పురాణపురుషుడిగా ఉంటూ ఉద్యోగం చెయ్యాలంటే, చాలా కష్టం" అని చెప్పారు. అవి రుచించలేదు కృష్ణమూర్తికి.

చిన్నప్పట్నుంచీ కృష్ణమూర్తి ఆంజనేయస్వామి భక్తుడు. వాక్యవిశారదుడైన ఆ స్వామి దయతో, పై అధికారులకి నొప్పి కలుగకుండా, తన ప్రవర్తన విషయంలో మారలేననీ, తాను అవసరమైతే ఉద్యోగం కూడా త్యాగం చేస్తానని విన్నవించుకున్నాడు.

కృష్ణమూర్తి అంటే తన డిపార్టుమెంటులో తెలియనవాళ్ళు లేరు! కృష్ణమూర్తి అనగానే "ఓ! ఆయనా! ఆయన భక్తి అను పంజరపు చిలుక!" అంటారు.

(ఆవలి తీరం జనవరి 2010)